హైదరాబాద్ వార్త



# ఘనంగా ప్రారంభమైన కోటి దీపోత్సవం

**ముషీరాబాద్, నవంబర్ 9, ప్రభాతవార్త:** ప్రతి సంవత్సరం కార్తీకమాసంలో లోయర్‌ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్ స్టేడి యంలో నిర్వహించే కోటి దీపోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయింది. మొదటి రోజు పుణ్యనదీజలాలతో కాశీస్పటిక లింగానికి శత అష్టోత్తర శంఖాభిషేకం, కోటి మల్లెల అర్చన, కాళేశ్వర, ముక్తేశ్వరస్వామి కళ్యాణోత్సవం నిర్వహించారు. తుని తపపోవనం పీఠాధిపతి సచ్చినాదంద సరస్వతి స్వామి ఆశీర్వచనం, నంబూరు శ్రీకాళీ వనాశ్రమాధిపతి శ్రీచంద్ర కాళీ ప్రసాద్ మాతాజీ అనుగ్రహభాషణం, డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు ప్రవచనామృతం, సప్త హారతులు, మహాదేవునికి మహానీరాజనాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, జస్టిస్ సూరేపల్లి నంద ముఖ్యఅతిధులుగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

# సమగ్ర ఇంటింటి సర్వే షురూ..

- ఇంటింటికి వెళ్ళి వివరాలు సేకరిస్తున్న ఎన్యూమరేటర్లు
- వివరాలు సేకరణలో పలువురు నివాసితుల అభ్యంతరం
- మా వివరాలు మీకెందుకు చెప్పాలంటూ దురుసు ప్రవర్తన

**హైదరాబాద్, నవంబర్ 9,ప్రభాతవార్త:** మూడురోజులపాటు ఇంటి యజమాని పేరు, ఇంటికి నంబరు వేసి సర్వే చేసి స్టిక్కర్లు అంటించిన ఎన్యూమరేటర్లు, శనివారం నుంచి సమగ్ర కుటుంబ సర్వేను ప్రారంభించారు. ఈ సర్వేలో 75 రకాల ప్రశ్నలతో రెండు సెక్షన్స్‌లో కుటుంబ వివరాలు నమోదు చేస్తున్నారు. 56 రకాలు వివరాలు ఖచ్చితంగా చెప్పాల్సిందిగా కోరుతూ మిగతావి తమకు ఇష్టముంటునే చెప్పమని చెబుతున్నారు. అయితే ప్రజలు తమ వద్ద ఆధార్ , రేషన్ కార్డు ఉంటే క్షణాల్లోనే కుటుంబ సర్వే పూర్తి అవుతుందని అధికారులు తెలిపారు. ఎవరికి ఎలాంటి పత్రాల కాపీలు, డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని ఎవరు ఎక్కడి నుంచైనా కుటుంబ వివరాలను నమోదు చేసుకోవచ్చని వివరించారు. అయితే ఈ సమగ్ర కుటుంబ సర్వే ఎన్యూమరేటర్లు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళా ఎన్యూమరేటర్లు విధి నిర్వహణలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సమస్యలు హైదరాబాద్ నగరంలో ఎక్కువగా ఎదురవుతున్నాయి. కొంతమంది ఇంటికి వెళితే ఇంటి యజమానులు దుర్భాషలాడటం, మీకెందుకు మా ఇంటి వివరాలు చెప్పాలంటూ, కుక్కలను వదులుతున్నారని మహిళా ఎన్యూమరేటర్లు కన్నీళ్లు పెట్టుకున్నారు. బంజారాహిల్స్ ప్రాంతంలో బాధ్యతలు నిర్వర్తించిన ప్రభుత్వ ఉపాధ్యాయునులు శుక్రవారం సమగ్ర కుటుంబ సర్వే చేయడానికి వెళ్లారు. స్థానిక గతి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయినులుగా విధులు నిర్వహిస్తున్న అపురూప, రమ్యశ్రీ సర్వే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సర్వేలో భాగంగా బంజారాహిల్స్‌లోని అరోరా కాలనీలో ఓఅపార్ట్‌మెంట్‌వద్దకు వెళ్లారు. అక్కడ నివసించే ఓమహిళ తమతో దురుసుగా ప్రవర్తించారని, అలాగే దుర్భాషలాడారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గురువారం కూడా ఇలాంటి అనుభూతే సర్వే చేస్తున్నప్పుడు ఎదురైందని వారిరువురు వాపోయారు. బంజారాహిల్స్ సాగర్ సొసైటీ ప్రాంతంలో కొన్ని నివాసాల వద్దకు వెళితే యజమానులు తమపై పెంపుడు కుక్కలను ఉసిగొల్పారని ఆవేదన వ్యక్తం చేశారు. పలు నివాసాల్లో యజమానులు తలుపులు తీయడం లేదని చెప్పారు. తమ వ్యక్తిగత వివరాలు మీకెందుకు చెప్పాలంటూ తిరిగి ఎదురు ప్రశ్నలు వేసి నిలదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే అరోరా కాలనీ ఘటనపై తమ ఉన్నతాధికారి ఫిర్యాదు చేశారని ఉపాధ్యాయులు తెలిపారు.



## సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలి

### -బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



తన నివాసంలో ఎన్యూమరేటర్లకు వివరాలు తెలుపుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్, చిత్రంలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్నేహాశబరీష్ తదితరులు

**హైదరాబాద్, నవంబర్ 9,ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టత్మాకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు ప్రజలందరూ పూర్తిగా సహకరించాలని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ, జిల్లా ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో భాగంగా బంజరాహిల్స్ రోడ్ నెంబర్ 13 మినిస్టర్స్ కాలనీ లో గల రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారి గృహంలో ఎన్యూమరేటర్లు మంత్రి కుటుంబ వివరాలను సేకరించి స్టిక్కర్ అతికించారు. ఈసందర్భంగా తమ కుటుంబ వివరాలను మంత్రి ఎన్యూమరేటర్లకు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు, వెనుకబడిన తరగతులు అలాగే ఇతర బలహీన వర్గాల అభ్యున్నత్తికై సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి అలాగే రాజకీయ అవకాశాలను మెరుగు పరుచుటకు పక్కా ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ప్రజలు పూర్తిగా సహకరించి వివరాలను తెలపాలని సూచించారు. ఎన్యుమారేటర్లు సర్వే చేసున్నా తీరును జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ స్నేహ శబరిష్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్డీవోసాయిరామ్, డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి , తహసీల్దార్ అనితారెడ్డి, సూపర్ వైజర్ శ్రీకాంత్, ఎన్యూమరేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

## నవ వధువు ఆత్మహత్య

**పేట్ బషీరాబాద్, నవంబర్ 9, ప్రభాతవార్త**

కాళ్లపారాణి ఆరకముందే నవవధువు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అరిపిరాల దుర్గ శ్రీదేవికి గత నెల అక్టోబర్ 16వ తేదీన వివాహం జరిగింది. అప్పటినుండి ఎంఎన్ రెడ్డి నగర్‌లోని వీక్యా రెసిడెన్సీ నందు ఉంటున్నారు. అయితే మృతురాలికి పెళ్లికి ముందు మరోవ్యక్తిని ప్రేమించడంతో అతన్ని మర్చిపోలేక శుక్రవారం సాయంత్రం 5వ అంతస్తు నుండి క్రిందకి దూకి ఆత్మహత్య చేసుకుంది. చికిత్స నిమిత్తం రస్ హాస్పిటల్‌కు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి తల్లిదండ్రులు రామలక్ష్మీ,శ్రీనివాస్‌ల ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## బంజారాహిల్స్‌లో ఉపాధ్యాయులపై కుక్కలు వదిలిన ఇంటి యజమాని

**-సమగ్ర కుటుంబ సర్వేకు వెళ్ళిన వారిపై ఇంటి యజమాని ఆగ్రహం**

**పంజగుట్ట,నవంబర్9 ప్రభాతవార్త:** తెలంగాణాలో సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఇద్దరు ఎన్యుమరేటర్‌లపై కుక్కలు వదిలిన సంఘటన బయటకు వచ్చి వైరల్‌గా మారింది.సమగ్రకుటుంబ సర్వేలో భాగంగా ఇద్దరు ఉపాధ్యాయులు బజారాహిల్స్‌లో తమకుయకేటాయించిన ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో బంజారాహిల్స్ అరోరా కాలనీలో ఉపాధ్యాయులైన అపురూప, రమ్యశ్రీలు ఒక ఇంటికి వెళ్ళి తాము సర్వే కోసం వచ్చామని తెలిపారు. ఇంటి యజమానులు వీరు చెబుతున్నది వినిపించుకోకుండా వీరిపై కుక్కలను వదిలారు. భయభ్రాంతులకు గురైన ఆ ఉపాధ్యాయులు బయటకు పరుగులు తీశారు. కుక్కలను వదలటమే కాకుండా ఇంటి యజమాని వీరిపై నానా దుర్భాషలకు దిగారు. వెంటనే వారు ఈ విషయమై ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఈ విషయం నెట్టింట వైరల్‌గా మారడంతో ఈ ఘటనపై దర్యాప్తు చేసి కుక్కలు వదిలిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని తెలంగాణా పోలీసులకు ఎక్స్‌వేదికగా ట్యాగ్స్ వెల్లువెత్తుతున్నాయి.

## మంత్రి సెల్‌ఫోన్ చోరీ

**పంజగుట్ట, నవంబర్ 9 (ప్రభాతవార్త):** మంత్రి సెల్‌ఫోన్ చోరీకి గురైందని పోలీసులకు ఫిర్యాదు అందింది.ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన విషయంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. వివరాలోకెళితే గత నెల 31 వ తేదీ దీపావళిరోజున బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 12లోని మంత్రుల నివాసాల సముదాయంలో ఉంటున్న మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుసెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కాగా ఇటీవలే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నివాసంలో కూడా దొంగతనం జరిగిన విషయం విదితమే. ఇపుడు శ్రీధర్‌బబాబు సెల్‌ఫోన్ చోరీకి గురికావడంతో ఈ విషయం ఇపుడు చర్చనీయాంశంగా మారింది.

## ట్రావెల్ బస్సు బీభత్సం

**యూసుఫ్‌గూడ, నవంబర్ 9, ప్రభాతవార్త**

ఈఎస్ఐ మెట్రో స్టేషన్ వద్ద ఓ ట్రావెల్ బస్సు భీభత్సం సృష్టించింది. అతివేగంతో దూసుకువచ్చిన గో టూర్ ట్రావెల్ బస్సు కారును ఢీకొట్టింది. బల్లారి నుంచి హైదరాబాద్ వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. అయితే కారులో నుంచి బయటికి దూకి డ్రైవర్ ప్రాణాలు దక్కించుకున్నాడు.బాధిత కారు డ్రైవర్ ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దార్యప్తు చేపట్టారు. బస్సు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి

**యూసుఫ్‌గూడ, నవంబర్ 9, ప్రభాతవార్త**

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గుల్బర్గా జిల్లా కమలాపురం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. వేగంగా వచ్చిన బొలేరో వాహనం కారును ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. మృతులను హైదరాబాద్ యూసుఫ్‌గూడ వాసులుగా గుర్తించారు. మృతుల నివాసాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## శాస్త్రిపురంలో ఫుట్‌పాత్‌లపై అక్రమ కట్టడాల తొలగింపు



శాస్త్రిపురంలో ఫుట్‌ఫాత్ ఆక్రమ కట్టడాలను తొలగిస్తున్న దృశ్యం

**మైలార్‌దేవ్‌పల్లి,నవంబరు 9 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని శాస్త్రిపురంలో జిహెచ్ఎంసి అధికారులు శనివారం ఫుట్‌ఫాత్‌లపై వెలసిన అక్రమ కట్టడాలను తొలగించారు.శాస్త్రిపురంలో జరిగిన కూల్చివేతలు సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. శాస్త్రిపురంలోరహదారులకు ఇరువైపుల ఉన్న ఫుట్‌ఫాత్‌లపై వ్యాపారాలు జరుగుతున్నాయి.ఫుట్‌ఫాత్‌లు కబ్జా పాలవ్వటంతో వాహనదారులు,ప్రజలు తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు.సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్ కావటంతో రద్దీ ఏర్పడుతున్నది. ఫుట్‌ఫాత్‌లపై ఆక్రమంగా వెలసిన కట్టడాలను రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తొలగించారు.ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## ఫిలింనగర్‌లో హైడ్రా కూల్చివేతలు

**-రోడ్డును ఆక్రమించి కట్టిన కట్టడాలు నేలమట్టం**

**హైదరాబాద్, నవంబర్ 9,ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్‌లో రోడ్లను ఆక్రమించి కట్టిన షాపులు, షెడ్లను శనివారం నగరం హైడ్రా అధికారులు తొలగించారు. జిహెచ్ఎంసి అధికారులతో కలిసి ఫిల్మ్ నగర్‌లోని ఆక్రమణలను హైడ్రా జేసీబితో కూల్చివేసింది. ఫిలింనగర్‌లో రోడ్డును ఆక్రమించి నిర్మించిన కట్టడాలపై స్థానికుల హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో ఫిలింనగర్‌లోని లేఅవుటును హైడ్రా అధికారులు పరిశీలించారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు జరిగినట్లు గుర్తించారు. ఇంటి ప్రహారీగోడ,రేకుల షెడ్డును జిహెచ్ఎంసి, హైడ్రా అధికారులు కూల్చివేశారు. కూల్చివేతల శిథిలాలను వెంటనే తొలగించారు. ఈసందర్భంగా జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడి ..వెంటనే ఆప్లేస్‌లో రోడ్డును నిర్మించాలని కోరారు.

**దొంగలతో చేతులు కలిపిన మాజీ కానిస్టేబుల్ మృతి**

**హుడా కాంప్లెక్, నవంబర్ 9 ప్రభాతవార్త:** దొంగలతో చేతులు కలిపి వారికి సహకరించిన మాజీ కానిస్టేబుల్ ఈశ్వర్ ను ప్రత్యర్థులు కారు తో ఢీ కొట్టి హత్యచేశారు. వివరాల్లోకి వెళితే.. నగరంలో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న ఈశ్వర్ కొన్ని ఏళ్లుగా పిక్ ప్యాకెటింగ్ కు పాల్పడుతు దొంగలకు సహకారం అందించేవాడు. ఈ విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో అతన్ని ఉద్యోగం నుండి తొలగించారు. దీంతో చెన్నైకి వెళ్లి పిక్ ప్యాకెటింగ్ వాళ్లతో స్నేహం ఏర్పరచుకున్నాడు. దొంగల ముఠా నాయకుల మధ్య విభేదాలు రావడంతో సెటిల్మెంట్ కోసం ప్రత్యర్థులు ఈశ్వర్ ను నగరానికి పిలిచి సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో కారుతో ఢీ కొట్టారు .గాయాల పాలైన ఈశ్వర్ ఐదు రోజులుగా విశ్వాన్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. దొంగల ముఠా నాయకుల మధ్య విభేదాలే కారణంగా ఈ హత్య జరిగి ఉండొచ్చని కోణంలో పోలీసులు దృష్టి సారించారు.ఈ దాడిలో పాల్గొన్న వారిలో ముగ్గురు పరారీలో ఉండగా, ఒకరిని సరూర్ నగర్ అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

# టేక్ కేర్..!

## -నగరంలో పడగ విప్పుతున్న క్యాన్సర్

## -గుండెపోటు తర్వాత స్థానం క్యాన్సర్‌దే

**హైదరాబాద్, నవంబరు 9 ప్రభాతవార్త**

క్యాన్సర్ పడగ విప్పుతోంది.అభివృద్ధి చెందుతున్న సమాజంలో క్యాన్సర్ కల్లోలం సృష్టిస్తోంది. రోగనిరోధక శక్తి తగ్గేకొద్దీ క్యాన్సర్ విస్తరణ వేగమూ అదేస్థాయిలో పెరుగుతోంది.క్యాన్సర్ బారినపడ్డ తరువాత చికిత్స చేయడం కన్నా అది దరికిచేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవడమే అత్యుత్తమమైన పని. జీవన పరిస్థితులు, కల్తీ ఆహారం, వ్యక్తిగత పరిశుభ్రత, జీవనశైలి వంటివి ఆరోగ్యంపై ప్రభావం కనబరుస్తాయి. క్యాన్సర్ ముందుగా గుర్తించడం సాధ్యంకాదని ఇప్పటికే చాలా మంది అపోహపడుతుంటారు. అది ఎంతమాత్రమూ నిజంకాదని వైద్యులు పేర్కొంటున్నారు. చాలా రకాల క్యాన్సర్లను తొలిదశలోన్లేనే పసిగట్టవచ్చు. ప్రజల్లో అవగాహన పెరగడం నేటి తక్షణావసరం. కొన్ని రకాల క్యాన్సర్లను మాత్రం తొలిదశలోనే గుర్తించడం కుదరదు. రొమ్ము, గర్భాశయ, చర్మ, నోటి, పేగు సంబంధ క్యాన్సర్లను చాలా మందుగానే గుర్తించడం సాధ్యమవుతుంది. లక్షణాల ప్రాతిపదికన ప్రాథమిక స్థాయిలోనే క్యాన్సర్‌ను గుర్తించినట్లయితే చికిత్స సులభమవుతుంది. మద్యపానం, పొగాకు సేవవనం వంటి అలవాట్ల వల్ల కలిగే దుష్పలితాలను విరివిగా ప్రచారం చేయడంతోపాటు పౌష్టికాహారం తీసుకోవాల్సిన అవశ్యకత పట్ల అవగాహన పెంచితే క్యాన్సర్‌ను చాలా వరకు నిరోధించవచ్చు. ఊపరితిత్తుల క్యాన్సర్ బారిన పడుతున్నవారిలో 71 శాతం ధూమపానం అలవాటు ఉన్నవాళ్లే. క్యాన్సర్ మరణాల్లో 22 శాతానికి పొగాకు సేవనమే కారణమవుతోంది. గుట్కా, పాన్ మసాలాలు, తంబాకు లాంటి వాటిని విచ్చలవిడిగా నమలడం..గంటల తరబడి నోట్లో పెట్టుకోవడంతో చాలా మందికి నోట్లో తీవ్రమైన అస్సర్లు కన్పిస్తున్నాయి. వీటిని నిర్లక్ష్యం చేయడంతో 2-5 ఏళ్లలో నోటి, హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ల కింద రూపాంతరం చెందే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అవగాహన లేమితో పొగాకు ఉత్పత్తులను వాడుతూ వారికి తెలియకుండానే బానిసలవుతున్నారు. ముఖ్యంగా బాధితుల్లో అధిక శాతం యువత ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి వచ్చే బాధితుల్లో 40 శాతం నోటి, హెడ్అండ్ నెక్‌లతో బాధపడుతున్నారని అక్కడి వైద్యులు పేర్కొంటున్నారు. యువత ఎక్కువ మంది గుట్కా, పాన్ మసాలాలు,, జర్దా లాంటి వాటిని అధికంగా తీసుకుంటున్నారు. కల్తీ ఆహారం, కల్తీ నూనెతో తయారు చేసే వంటలు వంటి వాటిని మానేయడం చాలా మంచిదని వైద్యులు సూచిస్తున్నారు. నోట్లో దీర్ఘకాలంగా పుండ్లు, తెల్లమచ్చలు లాంటివి ఉంటే నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు పేర్కొంటున్నారు. నోరు తెరవడం, గుటక వేయడం కష్టంగా ఉండటం,ఆహారం తీసుకుంటే మింగని వ్వకపోవడం, గొంతు బొంగురు పోవడం లాంటి లక్షణాలు కన్పిస్తే తక్షణం క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలంటున్నారు. ముందే గుర్తించడంతో నోటి క్యాన్సర్లను పూర్తిగా నివారించవచ్చు. చాలా మంది 2-3 దశలు దాటిన తర్వాత చికిత్సకు వస్తున్నారని, ఇలాంటి సమయాల్లో నియంత్రణ అనేది కష్టమని చెబుతున్నారు. సుదీర్ఘంగా పిప్పి పళ్లతో నోటి గోడలకు ఇన్‌ఫెక్షన్లు లాంటివి వస్తే ఆశ్రద్ధ చేయకూడదని వైద్యులు పేర్కొంటున్నారు.ఏటా ఈ మహమ్మారి కేసులు, మరణాలు చాప కింత నీరులా పెరుగుతున్నాయని ఆందోళన వెలిబుచ్చుతున్నారు. గాడితప్పిన జీవనశైలి కారణంగా కేసులు పెద్ద ఎత్తున నమోదవుతున్నాయని వివరిస్తున్నారు.

**30ఏళ్ళ వారిని వదలని మహమ్మారి...**

ప్రపంచంలో మరణాలకు దారితీసే అతి ముఖ్య కారణాల్లో గుండెపోటు తర్వాతి స్థానం క్యాన్సర్‌దే. గతంలో 50 ఏళ్ళు పైబడిన వారిలోనే ఎక్కువగా కనిపించేది. ప్రస్తుతం 30ఏళ్ళ వారిని వెన్నాడుతోంది. 30 నుండి 40 ఏళ్ళ వయస్సులో ఏటా 10శాతం కేసులు పెరుగుతుండటం ఆందోళన చెందాల్సిన అంశమే. దీని నివారణకు చర్యలు తీసుకోకుంటే 2025 నాటికి మొదటి స్థానానికి ఎగబాకే ప్రమాదం ఉందని డబ్ల్యూహెచ్‌వో హెచ్చరించింది.మన దేశంలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కారక వైరస్ పెళ్ళీడు కొచ్చిన మహిళలందరిలోనూ ఉంటుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో క్యాన్సర్‌గా రూపాంతరం చెందుతుంది. ముందే కనిపెట్టగలిగితే థర్మల్ క్రయోథెరపీ వంటి సులువైన పద్ధతుల్లో నయం చేయవచ్చు. రొమ్ములో క్యాన్సర్ కణితిగా రూపాంతరం చెందడానికి ముణ్నాలుగేళ్ళు పడుతుంది. ఈ సమయంలో కనిపెట్టగలిగితే చికిత్స సులువవుతుంది. క్యాన్సర్ లక్షణాలను ముందస్తుగా గుర్తించడం ద్వారా ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధునాతన చికిత్సలో పూర్తిగా నయం చేయడానికి అవకాశాలు మెరుగయ్యాయి.

**ఆలస్యంతోనే అధిక మరణాలు...**

హెపటైటీస్ బీ, సీలు కాలేయ క్యాన్సర్‌లకు, హ్యూమన్ పాసిలోమా వైరస్(హెచ్‌పీవీ) గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్ రావడానికి కారణమవుతున్నాయి. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు టీకా అందుబాటులో ఉంది. 8 నుండి 18 ఏళ్ళ వయస్సు వారికి దీన్ని ఇవ్వాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచిస్తోంది. కాలేయ క్యాన్సర్‌కు హెపటైటీస్ టీకా ఉంది. 40 ఏళ్ళు దాటిన మహిళ ఏడాదికోసారి మామోగ్రఫీ, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలి. అత్యధికుల్లో క్యాన్సర్‌ను గుర్తించడమే ఆలస్యమవుతోంది. దాంతో అప్పటికే ముదిరిపోయి మరణాలకు దారితీస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యంలో విస్తృతంగా క్యాన్సర్ ముందస్తు పరీక్షలు నిర్వహిస్తున్నారు. క్యాన్సర్‌కు ప్రధాన కారణాలలో సిగరెట్, గుట్కా, తంబాకు వంటి పొగాకు ఉత్పత్తుల వాడకంతో పాటు మితిమీరిన మద్యపానం, ఊబకాయం, వేపుళ్ళు, నిల్వ ఆహారం ఎక్కువగా తీసుకోవడం, వ్యాయామం చేయకపోవడం, అధిక ఒత్తిడి, తీవ్ర నిద్రలేమిఅని వైద్యులు పేర్కొంటున్నారు.

# స్తంభించిన కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ సేవలు

- -వక్ఫ్‌బోర్డు జి.ఓతో సర్వేనెంబర్56నుండి 226వరకు నిలిచిన రిజిస్ట్రేషన్లు
- -వందకోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి

**కుత్బుల్లాపూర్, నవంబరు 9 ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ కార్యకలాపాల్లో తీవ్ర స్థబ్దత ఏర్పడింది. ఒకవైపు ఒక రిజిస్ట్రేషన్‌లో తప్పులు జరిగాయంటూ విచారణ పేరుతో సికింద్రాబాద్ సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న జ్యోతిని అరెస్టుచేసి ఇప్పటివకే రిమాండ్‌కు తరలించిన సంఘటనతో ఒక్కసారిగా స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయంలో స్థబ్దత నెలకొంది. ఇదేతరుణంలో గోరు చుట్టుపై రోకలిపోటుగా తెలంగాణ రాష్ట్ర రిజిస్ట్రార్, కమిషనర్ నుండి కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని వక్ఫ్‌బోర్డు భూములపై పూర్తి వివరాలు తేలేవరకు సర్వేనెంబరు 226 వరకు వివిధ గ్రామ పంచాయితీలతో పాటు కుత్బుల్లాపూర్ , బాచుపల్లి, దుండిగల్ రెవెన్యూ మండలాల పరిధిలో గల ఆయా సర్వేనెంబర్లలో రిజిస్ట్రేషన్లను ప్రభుత్వ రిజిస్ట్రార్,కమిషనర్ నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేశారు. దీనితో కుత్బుల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని కుత్బుల్లాపూర్, బౌరంపేట, బాచుపల్లి మండలాలలోని అనేక రెవెన్యూ సర్వేనెంబర్లలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయారు. సుమారు వందకోట్ల రూపాయల నిధులు రిజిస్ట్రేషన్ల నిలిపివేతలో నిలిచిపోయాయి. ఇప్పటికే స్థానికంగా పోలీసుల విచారణ పేరుతో స్థానిక సబ్‌రిజిస్ట్రార్ విభాగం ఉన్నతాధకారినుండి క్రిందిస్థాయి ఉద్యోగుల వరకు పోలీసుల విచారణ భయంతో విధులకు హాజరుకావటమే మానేశారు. వీరకితోడు స్థానికంగా ప్రభుత్వ ఉద్యోగుల తోపాటుమరో ఎనమిది మంది క్రిందిస్థాయి సిబ్బంది వేతనాలపైప్రభావం చూపడంతో పాటు రిజిస్ట్రేషన్లకోసం వచ్చే ప్రజలకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇటు పోలీసుల విచారణతోపాటు రాష్ట్రప్రభత్వ పరంగా వివిధ విభాగాల అధికారులు విచారణ పేరుతో ఏ సమయంలో ఏ సిబ్బందిని పట్టుకుపోతారో తెలియని పరిస్థితిలో స్థానిక కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గందరగోళ పరిస్థితి చోటుచేసుకుంది. ఇక సబ్‌రిజిస్ట్రార్ పరిధిలో నిలిచిపోయిన సర్వేనెంబర్లపై ఆధారపడి వున్న లావాదేవీలు ప్రజలకు మరిన్ని ఇబ్బందులకు గురిచేసున్నాయి. సామాన్య, మధ్య తరగతి ప్రజలనుండి ఉన్నతవర్గాలకు రిజిస్ట్రేషన్ల నిర్వాహాణతోనే తమ వ్యాపారాలు ఆధారపడి వుండటంతో స్థానికంగా రిజిస్ట్రేషన్ల నిలిపివేత మరింత సంక్షోభానికి గురిచేస్తుంది. ఈ సందిగ్ధపరిస్థితిపై విచారించేందుకు పోలీసు ఉన్నతాదికారులు సైతం సూరారంలోని కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సందర్శించి పూర్తిస్థాయిలో లావాదేవీల నిర్వాహణకు కావాల్సిన చర్యలపై తనిఖీచేసి పోయారు. అయితే ఈచర్యలవల్ల ఎలాంటి ముందడుగు లేకపోవడంతో స్థానికంగా సందిగ్ధత ఆలాగే కొనసాగుతుంది. ప్రభుత్వపరంగా పూర్తిస్థాయి సందిగ్ధతకు కారణమైన వక్ఫ్‌బోర్డు భూముల సర్వేల విచారణను త్వరితగతిన పూర్తిచేయడంలో ప్రజాప్రతినిధులు , ఉన్నతాధికారులు ప్రత్యేకశ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా వుంది.




సూరారంలోని కుత్బుల్లాపూర్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

## డివిజన్‌ను అన్ని విదాలుగా అభివృద్ధి చేస్తున్నాం
### - కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ



రోడ్డు నిర్మాణం పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మీ తదితరులు

**మలక్ పేట ,నవంబర్ 9, ప్రభాతవార్త:** ముసారాంబాగ్ డివిజన్ ను అన్ని విదాలుగా అభివృద్ధి చేస్తున్నామని డివిజన్ కార్పొరేటర్ బొక్క భాగ్యక్ష్మి పేర్కొన్నారు. డివిజన్ లోని ఎస్ బిఐ కాలనీలో రూ.15 లక్షలతో నిర్మించనున్న రోడ్డు నిర్మాణం పనులను ఆమె స్థానిక కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని అధికారులు సిబ్బందికి సూచించారు. డివిజన్ ప్రజలకు ఎల్లవేళల అందుబాటులో ఉండి మౌళిక నదుపాయములు కల్పించి వారి సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తున్నమని తెలిపారు.ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్ స్పెక్టర్ సత్తిరెడ్డి, ఎస్ ఎఫ్ ఎ గణేష్, కాలని వాసులు రాము యదవ్, నారాయణ, శ్రవన్ కుమార్, రాఘవేంద్ర, అనిరుద్ ,పవన్ కుమార్, సందిప్ తదితరులు పాల్గొన్నారు.

## మేరు కులస్థులు కులగణన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొవాలి: పాల్కొం శ్రీనివాస్



సమావేశంలో ప్రసంగిస్తున్న పొల్కొం శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట నవంబర్ 9 , ప్రభాతవార్త :** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సమగ్ర కులగణన కార్యక్రమాని మేరు కులస్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మేరు యువజన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు . ఈ సందర్భంగా ఏర్పటు చేసిన నమవేశం లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న కులగణన కార్యక్రమాన్ని మేరు కులస్థులు, అన్ని కుల సంఘాలు విజయవంతం చేయాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర కుల గణన కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు.కార్యక్రమంలో నారుకులు పాశం రాజేందర్, వెన్న శివకుమార్, నవీన్ కుమార్, ఆదిమూలం శంకర్ పాల్గొన్నారు.

### ప్రయాణికులకు అద్దె ప్రతిపాదికన ఆర్టీసీ బస్సులు : డిపో మేనేజర్ సమత

**మలక్ పేట , నవంబర్ 9, ప్రభతవార్త :** ప్రయాణికులకు అద్దె ప్రతిపాదికన ఆర్టీసీ బస్సులను బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించడం జరిగిందని దిల్ సుఖ్ నగర్ ఆర్టిసి డిపో మేనేజర్ సమత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివాహాది శుభకార్యాలకు, దైవదర్శనాలకు, తీర్థయాత్రలకు, విజ్ఞాన, వినోద, విహారయాత్రలకు వెళ్లడానికి, అదేవిధంగా అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలకు వెళ్లడానికి టి జి ఎస్ ఆర్ టి సి దిల్ సుఖ్ నగర్ డిపో ఆధ్వర్యంలో అద్దె బస్సులను బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించడం జరిగిందని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు , భక్తులు , సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు . మరిన్ని వివరాలకు వెంకటేశ్వర్లు 9490116830, వెంకన్న 8639004635 లలో సంప్రదించాలని కోరారు .

## తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరగాల్సిందే



**తుర్కయంజాల్ నవంబర్ 9,ప్రభాతవార్త :** ఉద్యమకారులకు ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందేనని కేంద్రమంత్రి, బీజేపీ సీనియర్ నాయకులు బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి ఆధ్వర్యంలో బండి సంజయ్‌ని పలువురు నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు శనివారం మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కోసం వీరోచితంగా పోరాడిన నాయకులను ప్రభుత్వం విస్మరించడం సరికాదన్నారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ నాయకులు అమలు చేయాలని కోరారు. ప్రతి ఉద్యమకారునికి 250 గజాల స్థలం పెన్షన్ సౌకర్యం కల్పించాలని విన్నవించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడడంతో ఎంతోమంది కృషి ఉందని వారందరికీ కాంగ్రెస్ పార్టీ గుర్తించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు బొక్క నర్సింహారెడ్డి, బోసుపల్లి ప్రతాప్, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కోశాధికారి బచ్చిగళ్ల రమేష్, నాయకులు తూళ్ల నర్సింహ గౌడ్, ఉద్యమకారులు పి.బాలయ్యగౌడ్, కె.గణేష్ పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వేకు సహకరించాలి..
### -టెస్కాబ్ వైస్ చైర్మన్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య



**త్యుర్కయంజాల్ నవంబర్ 9 ప్రభాతవార్త :** తుర్కయంజాల్ మున్సిపాలిటీ శ్రీరామ నగర్ కాలనీ పరిధిలో ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని వైస్ చైర్మన్ ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి చైర్మన్ కొత్త కుర్మా సత్తయ్య పేర్కొన్నారు.శనివారం టెస్కాబ్ నివాసంలో సర్వే నిర్వహించిన అధికారులు, వివరాలు సత్తయ్య, మాజీ సర్పంచ్ కొత్తకుర్మ కళమ్మ, కుటుంబ సభ్యులు అందజేశారు.వారు మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో భాగంగా సామాజిక, ఆర్థిక, కుల సర్వేతో ఆర్థికంగా వెనుకబడిన వారికి చేయూత అందించాలని, దృడ సంకల్పంతో, ప్రభుత్వం తీసుకుందన్నారు. ప్రభుత్వం ప్రతిష్మాత్మకగా ప్రవేశ పెట్టుతున్న సంక్షేమ పథకాలు మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, 500 రూపాయలకే గ్యాస్, 10 లక్షల వరకు ఆరోగ్యశ్రీ, 200 యూనిట్లు కరెంటు బిల్ ఫ్రీ, ఇందిరమ్మ ఇండ్లు, అందజేస్తుందని అన్నారు. అధికారులతో సహాయక చర్యలు.కులగననకు ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

## సిఎం సహాయనిధి పేదలకు వరం : పరమేశ్వర్‌రెడ్డి



లబ్దిదారులకు సిఎం సహాయనిధి చెక్‌లు అందజేస్తున్న కాంగ్రెస్ ఇంచార్జీ ఎం.పరమేశ్వర్‌రెడ్డి తదితరులు

**ఉప్పల్, నవంబరు 9 ప్రభాతవార్త :** సిఎం సహాయనిధి నిరుపేదలకు ఒక వరం లాంటిందని ఉప్పల్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మంద ముల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం చిలుకానగర్, రామంతాపూర్‌కు చెందిన పలువురికి సిఎం సహాయనిధి పథకం కింద మంజూరైన చెక్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో సిఎం రేవంత్‌రెడ్డి అర్హులందరికి సిఎం సహాయనిధి కింద చేయూత అందజేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా షామిలికి రూ. 60వేలు, ఎం.శ్రీనివాసులుకు రూ.55 వేలు, రియాజుద్దీన్‌కు రూ.60వేలు, షాహీంహమీద్‌కు రూ.60వేలు, భారతికి రూ.60వేలు, అనూషకు రూ.60 వేలు, రాంచందర్‌రెడ్డికి రూ.60వేలు, మల్లేష్‌కు రూ.60వేలు, శృతికి రూ60 వేల చెక్‌లు మంజూరైనట్లు తెలిపారు. లబ్దిదారులకు వీటిని అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఆగంరెడ్డి, వల్లపు శ్రీకాంత్‌యాదవ్,కాలనీ నేతలు శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేష్ ముదిరాజ్, అస్లామ్, మధు, తుమ్మల రాజేందర్‌రెడ్డి, కిరణ్, వాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని ఎంపీ ఈటెలకు వినతి



ఎంపీ ఈటెల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న చింతల సురేందర్‌యాదవ్

**ఎల్.బి.నగర్, నవంబర్ 9 ప్రభాతవార్త:** నాగోల్ డివిజన్ సహాభావన సి-బ్లాక్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్ శనివారం మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వాటర్‌బిల్లు సమస్య గురించి వివరించడం జరిగిందని తెలిపారు. రానున్న మూడు రోజుల్లో వాటర్‌బోర్డు ఎండి ఒక మీటింగ్ ఏర్పాటు చేస్తారని హామీ ఇచ్చారని అన్నారు. వాటర్ సమస్యను దృష్టిలో పెట్టుకొని 3 బోర్‌వెల్స్ కూడా అందజేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆయా సమస్యలు త్వరగా పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎంపీ ఈటల రాజేందర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి బ్లాక్ ఓనర్స్ నల్ల మునీందర్, వైల రాజశేఖర్, వెంకట్‌రెడ్డి, శేఖర్, చెరుకూరి శ్రీనివాస్, విక్రమ్‌రెడ్డి పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేకు వినతి



డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఎబివిపి నేతలు

**ఉప్పల్, నవంబరు 9 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని పలువురు ఎబివిపి నేతలు శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఉప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు చేయడం జరిగిందని, భగాయత్‌లో ఏర్పాటు చేయాలని స్థానికుల నుంచి విన్నపాలు వస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకుని వచ్చి వెంటనే కళాశాల ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎబివిపి ఉప్పల్ జోన్ కన్వీనర్ బుర్ర అఖిల్, మహేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మీర్‌పేట్ కార్పొరేషన్‌లో సమగ్ర కుటుంబ సర్వే పరిశీలన



సర్వేను పర్యవేక్షిస్తున్న మీర్‌పేట్ మేయర్ దుర్గ దీప్‌లాల్

**సరూర్‌నగర్, నవంబర్ 9 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేను శనివారం మేయర్ ముదావత్ దుర్గ దీప్‌లాల్ చౌహాన్ పరిశీలించారు. తన స్వంత డివిజన్ 15లోని దీన్‌దయాళ్‌నగర్ కాలనీలో ఆమె కార్పొరేషన్ కమీషనర్ ఆర్.జ్ఞానేశ్వర్‌తో పాటు పలువురు అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె ఎన్యూమరేటర్లు చేస్తున్న కుటుంబ సర్వే, కుల గణనను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో డిఇ వెంకన్న, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, రెవెన్యూ ఆఫీసర్ చంద్రశేఖర్‌రెడ్డి, సానిటరీ ఇన్స్‌పెక్టర్ రమేష్, సూపర్‌వైజర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా గోపాష్టమి వేడుకలు



గోమాతకు పూజలు చేస్తున్న స్థానికులు

**నేరేడ్‌మెట్, నవంబర్ 9 ప్రభాతవార్త:** గోపాష్టమి వేడుకలు శనివారం విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో నేరేడ్‌మెట్ సాయినాధపురంలో ఘనంగా నిర్వహించారు. గోవులను వేదమంత్రాలతో పూజలు చేసి గోమాత ఆశీర్వాదం పొందారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం గోవును జాతీయ జందువుగా ప్రకటించి తల్లిలాంటి గోమాతను కాపాడాలని కోరారు.

## మినీ శిల్పారామంలో ఆకట్టుకున్న నాట్య ప్రదర్శనలు




ఉప్పల్ మినీ శిల్పారామంలో కూచిపూడి నాట్య ప్రదర్శనలు ఇస్తున్న కళాకారులు దృశ్యం.

**ఉప్పల్, నవంబరు 9 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం నటరాజ్య నృత్యాలయ జ్యోతిరెడ్డి శిష్య బృందం ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జతి స్వరం, అయిగిరినందిని, వినాయక కౌతం, రామరామ రామ తరంగం, గురు బ్రహ్మ, గురు విష్ణు, జనుత శబ్దం, రామాయణ శబ్దం, కృష్ణ శబ్దం, వినాయక కౌతం తదితర అంశాలను సహస్ర, గోపిక, శ్వేత, పార్వతి, మహాలక్ష్మి, హన్విత, నక్షత, వైష్ణవి, సిరి, హంసిని, కీర్తి తదితరులు తమ ప్రదర్శనలతో మెప్పించారు. శనివారం సెలవు దినం కావడంతో సందర్శకుల నుంచి మంచి స్పందన ఉందని నిర్వాహకులు తెలిపారు.

### ఉప్పల్‌లో కళాకారుడు చుక్క సత్తయ్య వర్థంతి



ఉప్పల్‌లో ఒగ్గు కళాకారుడు చుక్క సత్తయ్య వర్థంతి వేడుకలు నిర్వహిస్తున్న కురుమ సంఘం నేతలు

**ఉప్పల్, నవంబరు 9 ప్రభాతవార్త :** ఉప్పల్‌లో కురుమ సంఘం ఆధ్వర్యంలో ఒగ్గు కళాకారుడు చుక్క సత్తయ్య వర్థంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ కురుమ సంఘం సలహాదారులు జన్ని రఘు, గొరిగె మల్లేష్, గొరిగె ఐలయ్య, గొరిగె పెద్ద మల్లేష్, కమిటి అధ్యక్షుడు చిందం వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ బర్ల కృష్ణ, కొండ్ర హనుమంతు, యువత సలహాదారులు గొరిగె ఐలేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొని ప్రసంగించారు. కురుమల ఒగ్గు కథకు ప్రాణం పోసి వన్నె తెచ్చిన చుక్క సత్తయ్య సేవలు అభినందనీయమన్నారు. కురుమ సామాజిక వర్గానికి కాకుండా పేద ప్రజలకు ఎంతో సేవ చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం నేతలు మోటే నరసింహ, సోము జంగయ్య, గొరిగె నరసింహ,గొరిగె బాలమ్లేష్, ఎర్ర శ్రీనివాస్, కర్రె శ్రీనివాస్, నర్రి మహేందర్, సత్యనారాయణ, జన్ని సాయికుమార్, ఎర్ర వెంకటేష్, బర్ల బాలరాజు, ఎర్ర రాజు, ఆలే వెంకటేష్, మహిళా అధ్యక్షురాలు బట్కిరి మంజుల, సోము బాలమణి, ఇందిరా, ముత్యంగారి లత, ధనలక్ష్మి, మంగమ్మ, సుజాత, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రీ నగర్‌లో దశల వారీగా అభివృద్ధి పనులు




కార్పొరేటర్ లచ్చిరెడ్డి కి వినతిపత్రం అందజేస్తున్న గాయత్రీ నగర్ సంక్షేమ సంఘం సభ్యులు.

**వనస్థలిపురం నవంబర్ 9, ప్రభాతవార్త :** గాయత్రీ నగర్ ఫేస్ 3.కాలనీలో దశల వారీ గా అభివృద్ధి పనులు చేపడతామని బి.యన్.రెడ్డి.నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పేర్కొన్నారు. గాయత్రీ నగర్ ఫేస్3.సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏర్పాటు చేసుకున్న సందర్భంగా శనివారం కార్పొరేటర్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాలనీ లో త్రీ ఫేస్ కరెంట్, డ్రైనేజీ పైపులైన్ నిర్మాణం, రోడ్లు, వీధి దీపాలు,పార్క్ అభివృద్ధి తదితర పనులు చేపట్టాలని కార్పొరేటర్ కు వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందించిన కార్పొరేటర్ లచ్చిరెడ్డి కాలనీలో దశల వారీగా అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శ కాలనీ గా తీర్చిదిద్దుతామని కాలనివాసులకు హామీనిచ్చారు. కాలనివాసుల కు ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకు వస్తే తన వంతు కృషి చేస్తానన్నారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు రాజు గౌడ్,జగన్మోహన్ రెడ్డి, రామకృష్ణ, శంకర్,రాజేందర్ గౌడ్, మురళి,నరేష్ పాల్గొన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వేకు సహకరించండి : బండారు శ్రీవాణి



రామంతాపూర్‌లో సమగ్ర సర్వేను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి, జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు

**ఉప్పల్, నవంబరు 9 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య రాజకీయ కులగణన సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించాలని రామంతాపూర్ డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఎల్‌బినగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, డిప్యూటి కమిషనర్ అంజనేయులుతో కలిసి రామంతాపూర్ డివిజన్‌లో సమగ్ర కుటుంబ సర్వేను ఆమె ప్రారంభించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సమగ్ర సర్వే ద్వారా సామాజిక, రాజకీయ ఉపాధి రంగాల్లో వారికి మేలు జరుగుతుందని, ప్రతి ఒక్కరు సర్వేలో తమ వివరాలు ఇవ్వాలని సూచించారు. జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ కులగణన సర్వేలో ఎటువంటి పొరపాట్లు లేకుండా చూడాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. అధికారులు ఇంటింటికి తిరిగి సర్వే చేస్తారని, వారికి సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదల పాలిటి వరం : మధు యాష్కీ గౌడ్



సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న మధు యాష్కీ గౌడ్.

**వనస్థలిపురం. నవంబర్.9.ప్రభాతవార్త :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఎంతో మంది పేదలకు మెరుగైన వైద్య సేవలు పొందతున్నారని టి.పి.సి.సి. ప్రచార కమిటీ చైర్మన్, మాజీ.ఎం. పి. మధు యాష్కీ గౌడ్ పేర్కొన్నారు.అనారోగ్యంతో ఇటీవల ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పలువురు ఆర్థిక ఇబ్బందుల కారణంగా మధు యాష్కీ గౌడ్ ను కలవడం జరిగింది. స్పందించిన ఆయన రంగారెడ్డి జిల్లా మంత్రి శ్రీధర్ బాబు ద్వారా బాధితులకు సి.ఎం. రిలీఫ్ ఫండ్ చెక్కులను మంజూరు చేయించారు. అట్టి చెక్కులను వనస్థలిపురం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాధితులు హయత్ నగర్ కు చెందిన గడ్డం వెంకటేశ్వర్ల కు 50 వేలు,సాహెబ్ నగర్ కు చెందిన ఎం. తరుణ్ గౌడ్ కు 60వేలు,హస్తినాపురం కు చెందిన పుష్పమ్మ కు 60వేలు,నందనవనం కు చెందిన ఖుస్రా బెగం కు60 వేలు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మకుటం సదా శివుడు,కుట్ల నర్సింహ యాదవ్,చెన్నగొని రవి, వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎర్రగుంట చెరువును సందర్శించిన హైడ్రా అధికారులు



వివరాలు తెలుసుకుంటున్న హైడ్రా అధికారులు

**సైదాబాద్, నవంబరు 9 ప్రభాతవార్త:** సైదాబాద్ మెయిన్ రోడ్డు పక్కన ధోభిఘాట్ చౌరస్తాలో ఉన్న ఎర్రగుంట చెరువును శనివారం హైడ్రా అధికారులు సందర్శించారు. చెరువు విస్తీర్ణం, ఎఫ్‌టిఎల్ తదితర వివరాలను వారు పరిశీలించారు. హిందూ స్మశాన వాటిక సంక్షేమ సమితి సభ్యులు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, కూసూరు సహదేవ్ యాదవ్, కొరుదు భూమేశ్వర్, నిరంజన్ యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి, పుప్పాల శ్రీను, ధర్మరాజు, వినోద్ గౌడ్ పొదిల శ్రీధర్‌లు చెరువు కబ్జాల గురించి హైడ్రా అధికారులకు వివరించారు. ఎర్రగుంట చెరువును సంరక్షించాలని హిందూ స్మశాన వాటిక సంక్షేమ సమితి ఆధ్వర్యంలో గత నెలలో హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేష్, డిఇ ప్రవీణ్, ఎఇ మహేందర్‌లు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి శిక్షణలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి : కార్పొరేటర్ సునీత



మహిళలతో కలిసి జన శిక్షణా సంస్థాన శిక్షణా శిబిరాన్ని ప్రారంభించిన కార్పొరేటర్ సునీత శ్రీకాంత్‌గౌడ్

**సరూర్‌నగర్, నవంబర్ 9 ప్రభాతవార్త:** స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను మహిళలను సద్వినియోగం చేసుకోవాలని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 9వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మల సునీత శ్రీకాంత్‌గౌడ్ సూచించారు. రంగారెడ్డి జిల్లా జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో సాయిరాం నగర్ కాలనీ ఫేజ్-2 ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన జ్యూట్ ఉత్పత్తుల తయారీ, టైలరింగ్ శిక్షణా కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ మహిళలతో కలిసి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళల కోసం స్వయం ఉపాధి శిక్షణనివ్వడం హర్షణీయమన్నారు. వీటిని మహిళలు ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ రామ్మోహన్, స్వప్న, నవ్య, శిక్షకురాలు కె.పద్మావతి, శ్రీలక్ష్మి,అర్చన,కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.

## హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం కాలయాపన
### -కార్పొరేటర్ బిక్షపతిచారి



సిర్లా హిల్స్ లో సర్వే బృందంతో బిజెపి కార్పొరేటర్ బిక్షపతిచారి

**సరూర్‌నగర్, నవంబర్ 9 ప్రభాతవార్త:** ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మీర్‌పేట్ కార్పొరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి డిమాండ్ చేశారు. డివిజన్‌లోని సిర్లాహిల్స్‌లో కార్పొరేషన్ తరపున అధికారులు, ఎన్యూమరేటర్లు చేస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామీలను ప్రభుత్వం నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని ఆరోపించారు. సర్వేలో అంశాలపై ప్రజలు అయోమయానికి గురవుతున్నారని ఆయన తెలిపారు. కుల గణనకు ఆస్తుల వివరాలు అవసరమా అని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు బిజెపి ప్రశ్నిస్తునే ఉంటుందని చారి స్పష్టం చేశారు.

### సదర్‌వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి



సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు

**నేరేడ్‌మెట్, నవంబర్ 9 ప్రభాతవార్త:** వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని సంతోషిమానగర్‌లో సదర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే మైనం పల్లి హనుమంతరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బర్ల నరేష్ యాదవ్, కార్పోరేటర్ ప్రమ్ కుమార్, వెంకటేష్ యాదవ్, సతీష్ కుమార్, ఎన్.ఆర్.ప్రసాద్, సంతోష్, రాందాస్, వినోద్ యాదవ్, వెంకటేశ్వర్ రావు, రఘు యాదవ్, సందీప్ గౌడ్, సంపత్ గౌడ్, చరన్ జిత్ గౌడ్, ఇస్తరి తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లెలగూడలో మహేశ్వరం నియోజకవర్గ మాలల ఆత్మీయ సమ్మేళనం

**సరూర్‌నగర్, నవంబర్ 9 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గ మాలల ఆత్మీయ సమ్మేళనం నేడు ఆదివారం 10 గంటలకు మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలోనున్న శ్రీ బృందావన్ కన్వెన్షన్ హాల్‌లో జరుగుతుందని సుమమాల వికాస వేదిక కో-కన్వీనర్ ఎంగల యాదగిరి తెలిపారు. విశ్రాంత సైంటిస్టు జి.రాజేశ్వర్‌రావు అధ్యక్షతన ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సమ్మేళనానికి ముఖ్య వక్తలుగా మల్లెపల్లి లక్ష్మయ్య, పిఎస్ఎన్ మూర్తిలు, ముఖ్య అతిథులుగా మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజు వస్తాద్, మాల మహానాడు కో-కన్వీనర్ దామల సర్వయ్య, మాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బేర బాలన్న, , మాలల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల రాంప్రసాద్ తదితరులు హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు మాలలు అధిక సంఖ్యలో హాజరైన సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## నేడు కార్తీక వన సమారాధన

**సరూర్‌నగర్, నవంబర్ 9 ప్రభాతవార్త:** బాలాపూర్ మండల ఆర్యవైశ్య సంఘం, బడంగ్‌పేట్ నగర ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక మాస వనసమారాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని బాలాపూర్ మండల అధ్యక్షుడు నాళ్ళ శ్రీనివాస్‌గుప్త తెలిపారు. ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లే ఈసారి కూడా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ సారి ప్రముఖ పుణ్యక్షేత్రమైన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ సమీపంలోని ఝురాసంఘం శివ క్షేత్రంలో కార్తీకమాస వన సమారాధన తలపెట్టా మని ఆయన వివరించారు. దీనికి ఆరు బస్సుల్లో ఆదివారం వేకువ జామున పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య కుటుంబాలు తరలివెళ్తున్నట్లు ఆయన వెల్లడించారు.

## సమగ్ర సర్వేకు ప్రజలు సహకరించాలి



**అత్తాపూర్ నవంబరు9,ప్రభాతవార్త :** కుల గణన సర్వేకు ప్రజలు పూర్తి సహకరించాలని తమ ఇంటికి వచ్చే అధికారులు వివరాలను తెలిపిన నమోదు చేయించుకోవాలని డిఈఓ సుశీందర్ రావు,ఎంఈఓ శంకర్ రాథోడ్,సూపర్‌వైజర్ స్వరూప రాణలు పేర్కొన్నారు.సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం అత్తాపూర్ పరిధిలోని ఉపాధ్యాయులు చేస్తున్న సమగ్ర ఇంటింటి కుంటుంబ సర్వేను డిఈఓ,ఎంఈఓలు పరిశీలించారు.అనంతరం వారు మాట్లాడుతూ....ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి అందరూ సహకరించాలనానరు.ప్రభుత్వ పథకాల సద్వినియోగం,పరిపాలన ,ప్రజల స్థితిగతుల గురించి తమ వివరాలని తెలిపాలని సూచించారు.ప్రజలు ఎవ్వరూ కూడా సర్వేపై అపోహలు పెట్టుకోవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దమయంతి, చంద్రశేఖర్, సుమలత,శ్రీనివాస్, సౌమ్య,తదితరులు పాల్గొన్నారు.